**కథ**

# మహాభి నిష్క్రమణం

**ఎ.వి. రెడ్డి శాస్త్రి**

ఎంత అన్యోన్యమనీ వాళ్ల దాంపత్యం! చూసి తీరవలసిందే! భార్యని విడిచి భర్త ఒక్క క్షణమైనా వుండలేడు. భర్తతో వియోగాన్ని క్షణకాలమైనా వూహించలేని పతిప్రియ ఆమె. అన్నిటా యిద్దరికిద్దరూ- వారికి వారే సాటి. విద్యలోనేనా, వివేకంలోనేనా- ఒకరికొకరు రవ్వంతయినా తీసిపోరు. అక్కడితో ఆగిపోలేదు కథ.వారి జ్ఞాన జిజ్ఞాస మాట సరేసరి. ప్రకృతినీ, ప్రకృతిలోని ప్రతి కదలికనీ, ప్రకృతిని శాసించగలనని భ్రమిస్తున్న మనిషినీ, అనంత కాలగమనంలో కేవలం క్షణిక మాత్రమే అయిన మానవ అస్తిత్వాన్నీ, ఇలాటి వేగహనమయిన మరికొన్ని విషయాల్నీ- అనునిత్యం వాళ్లు తర్కిస్తూ వుండేవారు. క్షణికంలా అనిపించే ఈ మానవజన్మ అర్థవంతమా, అర్థరహితమా అనే జిజ్ఞాస సదా వారి చర్చల్లో చోటుచేసుకొనే దార్శనిక మర్మం. ఇలా ఎన్నెన్నో గహనమైన జ్ఞాన సూక్ష్మాల గురించి వారిరువురూ నిత్యం తర్కించుకుంటూ వుండేవారు. ప్రతిరోజూ ఏదో ఒకకొత్త అన్వేషణకి దారితియ్యాలనే జ్ఞానతృష్ణ వారిది.

పెద్దలు ప్రోది చేసి యిచ్చిన సిరిసంపదలు బహుగానే వున్నాయి వారికి. అంచేత ధనాన్వేషణలో జీవిత కాలాన్ని వ్యర్థం చేసుకోవలసిన అవసరం కలగలేదు. జీవించటం అన్నది- ఈ జీవిత పరమార్థాన్ని అన్వేషించడానికే అన్నట్టుగా వుండేది వారి దృక్పథం.

పోనివ్వండి- వారి ఆస్తుల వివరాలు, వారి తర్క పరిజ్ఞానాలు, వారి అన్వేషణాసక్తులు- వీటిని కాసేపు పక్కకి వుంచి- వారి రూపు రేఖ విలాసాలను ఒక్కసారి వీక్షిద్దాం. అసలు చెప్పుకోవలసింది నిజానికి దాని గురించే. వారిరువుర్నీ చూడ్డం, చూడగల్గడం నిజంగా ఒక నేత్ర పర్వం, ఒక నయనానందం. ఆమె రంభ, అతను నలకూబరుడు- ఆమె రతీదేవి, అతను మన్మథుడు- ఇలాటివన్నీ చాలా పేలవంగా అనిపిస్తాయి వారిరువురి సౌందర్యదీప్తి ముందు. లోకోత్తర సౌందర్య వారిరువురిదీను. కాని చిత్తంలో ప్రకంపనాలని సృష్టించేది కాదు ఆ సౌందర్యం. చూస్తున్నవారిలో ఏదో ఒక సాత్విక భావం, స్థాయీభావం ప్రేరేపించే సౌందర్యం. శివపార్వతుల దర్శనభాగ్యం లభిస్తే- వారిని చూసి తరించాలని కాకుండా, వారి పాదాల ముందు వినమ్రంగా ప్రణమిల్లి తరించాలనే తపన కలిగితే ఎలా వుంటుందో- అలాటి భావమే కలుగుతుంది- వారిరువుర్నీ దర్శించినప్పుడు.



ఇక వారి సంభాషణా వైచిత్రి? ఇరువురి మాటలూ మధు మాధుర్య శకలాలు. ఆమె పలికితే సంగీతం. అతను మాట్లాడితే సంగీతపు ఝరి. ఆమె ప్రతి కదలికా ఒక నృత్య భంగిమ. అతని ప్రతి పలుకూ ఒక నట్టువాంగం. వాక్కు కూడా ఒక తపస్సే అన్న నానుడికి నిదర్శనం వారి సౌజన్యపూరిత సత్సంభాషణే. చేష్టతోగాని, వూహతోగాని, మాటతోగాని- ఏ మనస్సునీ, ఏ ప్రాణినీ నొప్పించని అతి సాత్విక స్వభావం వారిది. ఆ విధంగా అప్రకటిత ఆనంద వాహినిగా సాగిపోతున్న వారి జీవన సరస్వతి- వారికి పుత్రోదయం కావటంతో- మరింత సంపూర్ణతనీ, మరింత వైలక్ష్యతనీ సంతరించుకుంది.



ఈ జీవితం ఒక రాహులమా, లేక రమణీయమా- ఖేదమా, మోదమా- వరమా, శాపమా- అని వారిరువురూ నిత్యమూ, నిరంతరమూ సాగిస్తూ వచ్చిన అన్వేషణ- పుత్రోదయంతో క్రొంగొత్త ఆకృతిని సంతరించుకొని- ఇప్పుడు నన్ను నిర్వచించండి- అని సవాలు చేస్తున్నట్టుగా- వారి ముందు నిల్చుంది. అయితే, ఈ దార్శనిక పద్మవ్యూహాల విశ్లేషణ గురించి, తదుపరి. ముందుగా వారి కుమారుడి గురించి.

కుమారుడంటే ఏదో అందరు మనుషులకీ జన్మిస్తూ వుండే మామూలు పుత్రుల్లాంటి వాడేనా? అబ్బే, కాదుగాక కాదు. సృష్టిలోని మార్దవాన్నంతటినీ, అందాన్నంతటినీ, సౌకుమార్యాన్నంతటినీ, కలబోసి, ఒక ఆకృతిగా, ఒక ప్రతిమగా తీర్చిదిద్దగలిగితే, ఎంత అతిలోక సుందరంగా ఆ ఆకృతి వుండవచ్చునో, అదిగో అంత అందంగాను వుద్భవించేడు వారి బిడ్డ.

ఇప్పుడు వారి సంతోషానికి అవధి లేకుండా పోయింది. ప్రతి క్షణం పుత్ర సాన్నిధ్యంలోనే గడిచిపోతోంది వారికిప్పుడు. ఇంత కాలం జరిపిన దార్శనిక విన్యాసాలూ, జ్ఞానగవేషణలూ, తార్కిక మార్మికతలూ, మిధ్యామిధ్యల ఉయ్యాలలాటలూ-అన్నీ, అన్నీ యిప్పుడు పుత్ర ధ్యాన సముద్రంలో అక్కడక్కడ, పడి విరిగిపోయిన అలల శకలాల్లా కనిపిస్తున్నాయి వారికి. ఇప్పుడు వారి ప్రతి మాటా, ప్రతి ఊహా, ప్రతి చేష్టా బిడ్డడి గురించే జరుగుతోంది. పుత్ర సాన్నిధ్యంలో కాలం కదులుతున్న స్పృహే కలగడం లేదు వాళ్లకిప్పుడు.

దినాలు గడుస్తున్నకొద్దీ వారి పుత్ర వాత్సల్యం మరింతగా చిక్కబడుతోంది.అలాటి సమయంలో ఓనాడు మధ్యాహ్న భోజనం ముగించి తీరుబడిగా తాంబూల చర్వణం చేస్తున్నారు. మాతృత్వంతో లభించిన వరం కాబోలు, ఆమె యిప్పుడు ఇనుమడించిన సౌందర్య రాసిగా భాసిస్తోంది.

వడిలో నిద్రిస్తున్న బిడ్డని మృదువుగా స్పృశిస్తూ, ఆత్మీయుడైన ప్రాణనాథుడ్ని తమకంగా చూస్తూ, ఇలా అన్నది "స్వామీ, ఈ పసికందుని చూస్తుంటె తనువు పులకరించిపోవడం లేదూ? ఒక క్షణమైనా రెప్ప వాల్చాలని అనిపిస్తోందా వీడిని చూడడం ఆపి?ఏదో కాస్త కాస్త తెలిసిన జ్ఞానమే తప్పిస్తే, మనం కూడా తప్పిస్తే, మనం కూడా అందరిలాంటి సామాన్యులమే కదా! అలాటి మనమే యీ బిడ్డడి విషయంలో ఇంతలా వాత్సల్యంతో కరగిపోతుంటే, మహోన్నత జ్ఞానసంపన్నుడు సిద్దార్థుడికీ, అతిలోక లావణ్యరాసి యశోధరకీ జన్మించిన ఆ అందాల రాహులుడ్ని చూస్తున్నప్పుడు-వారికి ఎంతటి ప్రేమాతిశయ భావాలు కలిగివుంటాయో కదా! యశోధర లాంటి సౌందర్యరాశిని, రాహులుని వంటి ముద్దులు మూటగట్టే బిడ్డడ్ని, తనని పరివేష్టించి వున్న సుఖాల్ని, భోగాల్ని, రాజ్యాన్ని- తృణప్రాయంగా భావించి, సిద్దార్థుడు ఎలా ఈ బంధాల్ని ఛేదించుకొని మహాభి నిష్క్రమణం చేయగలిగేడా అని ఆశ్చర్యం కలుగుతూ వుంటుంది. అనన్యసామాన్యమయిన ఆ వైరాగ్య దృక్పథాన్ని నేను వూహించను కూడా వూహించలేకపోతున్నాను.మీ వూహాలకి ఏమైనా అందుతోందా- అతనీసంసార వ్యామోహా బంధాల్ని వదిలించేస్కొని, ఎలా మహాభి నిష్క్రమణానికి వుద్యుక్తుడు కాగలిగేడో?" భర్త దార్శనిక దృష్టి మీద ఆమెకి అచంచలమైన విశ్వాసం. అలాటి వ్యక్తి తన సందేహాన్నేరకంగా నివృత్తి చేయగలడో వినాలని వళ్లంతా చెవులు చేస్కొని, వళ్లంతా కళ్లు చేస్కొని తదేకంగా అతనినే చూస్తోంది.

కొన్ని క్షణాలు నిశ్శబ్దంలో గడిచాయి. సాలోచనగా భార్యనీ, ఆమె వడిలో ప్రశాంతంగా నిద్రిస్తున్న తనయుడ్నీ చూశాడతడు. తదుపరి పైమీద వున్న ఉత్తరీయాన్ని తీసి, పక్కనే వున్న పాల సముద్రం లాంటి పర్యంకం మీద జారవిడిచేడు. ఎంతో నెమ్మదిగా, ఎంతో స్థిరంగా, ఎంతో గంభీరంగా- మేరుపర్వతమే లేచి నుంచున్నట్టుగా- లేచి నిలబడ్డాడు. అలా నిలబడి- ప్రశ్నించిన తన భార్యనీ, నిద్రిస్తున్న బిడ్డనీ- నిమీలిత నేత్రాలతో- ఎక్కడో అనంత దూరంలో సన్నిధి చేసివున్న ఏ మహాశక్తినో దర్శిస్తున్నట్టుగా చూస్తూ- "బహుశా ఇలాగే వెళ్లిపోయి వుంటాడు" అనేసి, నిగర్వంగా, నిండుగా, గంగాస్రోతస్వినిలా కదలని గతితో కదులుతూ- ఇల్లు విడిచి వెళ్లిపోయాడు.

భక్తి నివేదన

ఉభయ వేదాంత ప్రవర్తకులూ, శ్రీ సంప్రదాయ శిరోమణులూ, సద్గురువులూ శ్రీమాన్ టి.పి. రామచంద్రాచార్య స్వామివారికి ఈ కథా కుసుమాన్ని భక్తిపూర్వకంగా సమర్పించుకుంటున్నాను.

*(ఈ కథకి ఆధారం: వంద్యనీయులు కాటూరి పింగళిగారలు రచించిన 'సౌందర్యనందకావ్యం'.)*